

# పాతగుట్టలో వైభవోపేతంగా 'ధ్వజారోహణం'

**రెండో రోజుకు చేరిన పాతగుట్ట బ్రహ్మోత్సవాలు**

**ధ్వజారోహణం ద్వారా సకల దేవతలకు ఆహ్వానం పంపి భేరిపూజతో స్వాగతం పలికిన అర్చకులు**

**నేడు లక్ష్మీనరసింహుడి ఎదుర్కోలు మహోత్సవం**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట టెంపుల్ కు అనుబంధ ఆలయమైన పాతగుట్ట(పూర్వగిరి) శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం ధ్వజారోహణం, హోమం, వేదపారాయణాలు.. సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం ఉత్సవాలను ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యుల అర్చకత్వంలో ఆలయ అర్చకుల బృందం వైభవోపేతంగా నిర్వహించారు. మొదట ఉదయం యజ్ఞాచార్యులు ప్రత్యేక పూజలతో యజ్ఞశాలలో హోమంను కాల్చి ధ్వజారోహణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంతకుముందు స్వామివారిని ప్రత్యేక అలంకారంలో ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు.



### కరతాళ ధ్వనుల మధ్య 'ధ్వజారోహణం', భేరిపూజ

బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ధ్వజారోహణ మహోత్సవాన్ని కరతాళ ధ్వనుల మధ్య అర్చకులు ఘనంగా జరిపారు. సామూహిక దీక్షాపరులైన వేదపారాయణికులచే చతుర్వేద పారాయణాలు, పురాణ, ఇతిహాస, ప్రబంధ, మూలమంత్ర, మూర్తిమంత్ర జపాలతో ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధ్వజారోహణ ఉత్సవంలో భాగంగా గరుడాళ్వారుల ప్రతిమను తెల్లని వస్త్రంపై చిత్రించి, ధ్వజస్తంభానికి అలంకరించారు. అనంతరం గరుడ ముద్దలను గాలిలోకి ఎగురవేస్తూ నరసింహుడి కల్యాణానికి గరుత్మంతుడి ద్వారా సకల దేవతలను ఆహ్వానించే ఉత్సవాన్ని కనువింపుగా జరిపించారు. ధ్వజారోహణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు పాపవిముక్తి, గరుడ ముద్ద ప్రసాదాన్ని స్వీకరించిన మహిళలకు సంతాన ప్రాప్తి కలుగుతుందని అర్చకులు భక్తులకు ప్రవచించారు. ఇక ఉదయం ధ్వజారోహణం ద్వారా నరసింహుడి కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించే ఘట్టాన్ని జరిపిన అర్చకులు, సాయంత్రం ఆలయంలో భేరిపూజ, దేవతాహ్వానం కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ ఆహ్వానాన్ని మన్నించి లక్ష్మీసమేత నారసింహులను దీవించడానికి భువికి దిగివచ్చిన సకల దేవతలకు ఘనస్వాగతం పలికే భేరిపూజ, దేవతాహ్వానం ఘట్టాలను ఆలయ అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఈవో భవానీ శంకర్, చైర్మన్ నరసింహమూర్తి, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈవో మహేష్, సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎదుర్కోలు మహోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజు శుక్రవారం ఎదుర్కోలు మహోత్సవాన్ని చేపట్టనున్నారు. మొదట ఉదయం సింహ వాహన అలంకార సేవలో లక్ష్మీనరసింహులను ఆలయ తిరువీధుల్లో విహరింపజేయనున్నారు. తర్వాత సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారిని ఆలయ మాఢవీధుల్లో ఊరేగించిన అనంతరం.. రాత్రి 7 గంటల నుండి ఎదుర్కోలు మహోత్సవాన్ని జరపనున్నారు.

# డాలర్ల మాయంపై విచారణ కమిటీ

### యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని ప్రచార శాఖలో మాయమైన నారసింహుడి ప్రతిమ కలిగిన బంగారు, వెండి డాలర్ల ఘటనపై ఉన్నతాధికారులతో విచారణ కమిటీ వేసి దర్యాప్తునకు ఆదేశించామని, విచారణలో తేలిన అంశాల ఆధారంగా తదుపరి శాఖాపరమైన చర్యలు ఉంటాయని యాదగిరిగుట్ట ఆలయ ఈవో, ఐఏఎస్ అధికారి భవానీ శంకర్ తెలిపారు. గురువారం యాదగిరిగుట్టపై ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన తర్వాత డాలర్ల మాయం విషయం తన దృష్టికి వచ్చిందన్న ఆయన.. ఎంక్వైరీ కమిటీ రిపోర్ట్ అందాక తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఘటనకు పాల్పడిన వ్యక్తులను గుర్తించడమే కాకుండా ఇకపై ఇలాంటివి రిపీట్ కాకుండా ఏవిధమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలో కూడా సూచించాలని కమిటీని అదేశించామని పేర్కొన్నారు. కమిటీ రిపోర్ట్ అందాక సంబంధిత వ్యక్తులపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



### మళ్లీ బయటపడ్డ నిర్వహణ లోపాలు

ఆలయంలోని ప్రసాద తయారీ కేంద్రంలో ఇటీవల జరిగిన చింతపడు చోరీ ఇష్యూను మరవకముందే.. బంగారు, వెండి డాలర్ల మాయం ఘటన ఆలయ నిర్వహణా లోపాలు మరోసారి బట్టబయలయ్యాయి. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేకపోవడం వల్లే తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని భక్తులు చర్చించుకుంటున్నారు. రోజువారీగా భక్తులకు విక్రయిస్తున్న డాలర్లకు సంబంధించిన డబ్బులు ఖాతాలో జమ అవుతున్నాయా.? లేదా.? అని పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమా.? లేక వారి అండతోనే జరిగిందా.? అనే అనుమానాలను భక్తులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలకు ఫుల్ స్టాప్ పడాలంటే సంబంధిత శాఖను చూసే పైస్థాయి అధికారి నుండి కింది స్థాయి ఉద్యోగి వరకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఈ నెల 26, 27న రూ.10 లక్షల వరకు జమ.?

డాలర్ల ఇష్యూపై సోషల్ మీడియాలో జరుగుతున్న విధంగా మాయమైన డాలర్ల విలువ భారీగా ఉందనేది అవాస్తవమని ఆలయ అధికారులు కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. గత 20 రోజుల క్రితం ప్రచార శాఖ ద్వారా భక్తులకు విక్రయించిన 18 డాలర్లకు సంబంధించిన డబ్బులు ఆలయ ఖాతాలో జమ చేయకుండా ప్రచార శాఖ సిబ్బంది సొంత అవసరాల కోసం వాడుకున్నారని, ఆ డబ్బును ఈ నెల 26, 27 తేదీల్లో తిరిగి ఆలయ ఖాతాలో జమ చేసినట్లు ఆలయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా బంగారు డాలర్ 3 గ్రాములు, వెండి డాలర్ 5 గ్రాములుగా ఉంటుందని, మొత్తం 18 డాలర్లకు సంబంధించిన అమౌంట్ ను ఆలయ ఖాతాలో జమ చేశారని కావాలనే లీకులు ఇస్తున్నట్లు అర్థమవుతోంది. జరిగిన తప్పును కప్పిపుచ్చుకోవడం, ఇష్యూను డైవర్ట్ చేయడం కోసమే ఆలయ ఉన్నతాధికారులు ఇలాంటి లీకులు ఇస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. కానీ మిస్ అయిన డాలర్ల విలువ దాదాపుగా రూ.10 లక్షలకు పైగా ఉందని, విషయం బయటకు పొక్కడంతో హుటాహుటిన రూ.10 లక్షల అమౌంట్ అలాయ ఖాతాలో జమ చేపించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కానీ కేవలం 18 డాలర్లకు సంబంధించిన డబ్బు మాత్రమే మిస్ యూస్ అయిందని, అట్టి అమౌంట్ ను డిపాజిట్ చేపించామని ఆలయ అధికారులు లీకులు ఇస్తున్నారు.

### 20 ఏళ్ల నుండి డాలర్ల విక్రయం

యాదగిరిగుట్ట దేవస్థానంలో గత 20 ఏళ్ల నుండి స్వామివారి ప్రతిమ కలిగిన డాలర్ల విక్రయం జరుగుతోంది. కాగా మధ్యలో కొన్నేండ్లు డాలర్ల విక్రయాన్ని దేవస్థానం నిలిపివేయగా.. 2023లో మళ్లీ విక్రయం ప్రారంభించారు. ఆలయ ఈవో పర్యవేక్షణలో ఆలయ ఏఈవో ఆధీనంలో కొనసాగే ప్రచార శాఖలో డాలర్లను భద్రపరిచి భక్తులకు విక్రయిస్తారు. ప్రతిరోజు విక్రయానికి సంబంధించిన డబ్బు ఆలయ ఖాతాలో జమ చేసి రిజిష్టర్ లో ఎంట్రీ చేస్తారు. కాగా భక్తులకు విక్రయించిన డాలర్లకు సంబంధించిన డబ్బును ఆలయ ఖాతాలో జమ చేయకపోవడంతో.. ఆడిట్ అధికారులు గుర్తించి ఆలయ ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో గురువారం ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి భవానీ శంకర్.. ఆలయ ఉన్నతాధికారులతో కమిటీ వేసి విచారణకు ఆదేశించారు. విచారణ కమిటీ ఇచ్చే నివేదికను బట్టి తదుపరి చర్యలు ఉండనున్నాయి.



# యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా భవానీ శంకర్

### ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి భవానీ శంకర్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా సీనియర్ ఐఏఎస్ అధికారి భవానీ శంకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ రాజ్ భవన్ లో గవర్నర్ జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తించిన భవానీ శంకర్ ను.. ప్రభుత్వం ఈ నెల 17న ఆలయ ఈవోగా ట్రాన్స్ఫర్ చేసింది. కానీ రాజ్ భవన్ విధుల నుండి రిలీవ్ కావడం ఆలస్యం కావడంతో.. ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టడంలో జాప్యం జరిగిందని ఆలయ వర్గాలు వెల్లడించాయి. ఈవోగా ఛార్జ్ తీసుకోవడం కోసం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో కార్యాలయంలో ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు సేవ చేసుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఫ్యామిలీతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా అన్ని రకాల సదుపాయాల కల్పనకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొంటారు. ఈవోగా బాధ్యతలు తీసుకున్న ఐఏఎస్ భవానీ శంకర్ కు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ అధికారులు నారసింహుడి ఫొటోను బహూకరించారు.

# జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మున్సిపాలిటీ సహా యాదాద్రి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ చీఫ్ బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు. యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్ట, ఆలేరులో సీపీఐతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు కూడా కాంగ్రెస్, సీపీఐ కూటమిగా జతకట్టి పోటీ చేశామని, ఇప్పుడు కూడా అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలు వేగంగా అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అధికారంలో లేని బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటేస్తే బూడిదలో పోసిన పన్నీరులా ఓటు వృథా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. అదే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటేసి గెలిపిస్తే అభివృద్ధి వేగంగా జరగడానికి ఆస్కారం లభిస్తుందన్నారు. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా ఆగమైన యాదగిరిగుట్ట పట్టణంలో.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి ఊపందుకుందని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా అభివృద్ధి చేయని బీఆర్ఎస్ నాయకులు.. తమ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని చెప్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయనోళ్లు ప్రతిపక్షంలో ఉండి ఎలా చేస్తారని ప్రశ్నించారు. కచ్చితంగా జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకోబోతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోద శ్రీరాములు, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు బందారపు బిక్షపతి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, కాంగ్రెస్ పార్టీ 4వ వార్డు అభ్యర్థి కాటబత్తిని ఆంజనేయులు, 11వ వార్డు అభ్యర్థి ముక్కెర్ల మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల నాయకుడు హేమేందర్ గౌడ్, కాంగ్రెస్, సీపీఐ నాయకులు తదితరులు ఉన్నారు.


ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 30
జనవరి 2026



# కళ్లలో తరచూ నీరు కారుతోందా? కారణాలు తెలుసుకోండి..

చాలా మందికి తరచూ కళ్లలో నీరు కారే సమస్య ఉంటుంది. చాలా మంది దీన్ని చిన్న సమస్యగా భావించి పట్టించుకోరు. కానీ ఇది కొన్ని సందర్భాల్లో ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చు. కాబట్టి కళ్ల నుంచి తరచూ నీరు కారితే నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

దుమ్ము, పొగ, గాలి, ఎక్కువసేపు మొబైల్ లేదా కంప్యూటర్ ఉపయోగించడం వల్ల కళ్లలో చికాకు కలిగి నీరు కారవచ్చు. అయితే ఈ సమస్య తరచూ లేదా ఎక్కువ కాలం కొనసాగితే.. అది అలెర్జీ, ఇన్ఫెక్షన్ లేదా ఇతర కంటి సమస్యలకు కారణం కావొచ్చు.



### కళ్లలో తరచూ నీరు కారడానికి కారణాలు

- కళ్ల నుంచి ఎక్కువగా నీరు కారడానికి అనేక కారణాలు ఉన్నాయి:
- అలెర్జీలు: దుమ్ము, పొగ వల్ల కళ్ళలో దురద, ఎరుపు, నీరు కారడం జరుగుతుంది.
- కంటి ఇన్ఫెక్షన్: బ్యాక్టీరియా లేదా వైరస్ కారణంగా కళ్లు ఎర్రగా మారి నీరు కారవచ్చు.
- పొడి కళ్లు (డ్రై ఐస్): కళ్లు పొడిగా మారినప్పుడు శరీరం ఎక్కువ కన్నీళ్లను ఉత్పత్తి చేస్తుంది.
- కన్నీటి నాళాల్లో అడ్డంకులు: కన్నీటి నాళాలు మూసుకుపోతే కళ్లలో నీరు నిల్వ ఉంటుంది.
- సైనస్ సమస్యలు: సైనస్ ఇన్ఫెక్షన్ వల్ల కూడా కళ్లలో నీరు కారవచ్చు.
- వయస్సు పెరగడం: వృద్ధాప్యం కారణంగా కూడా కంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి.
- అధిక స్క్రీన్ వినియోగం: మొబైల్, ల్యాప్‌టాప్, టీవీ ఎక్కువసేపు చూడటం వల్ల కళ్లు అలసిపోతాయి.

### కళ్లలో నీరు కారకుండా ఎలా నివారించాలి?

- కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ జాగ్రత్తలు పాటించండి:
- కళ్లను తరచూ రుద్దకూడదు.
- దుమ్ము, పొగ నుంచి కళ్లను రక్షించుకోండి.
- మొబైల్, కంప్యూటర్ వాడేటప్పుడు మధ్య మధ్యలో విరామం తీసుకోవాలి.
- మురికి చేతులతో కళ్లను తాకవద్దు.
- చల్లటి నీటితో కళ్లను కడుక్కోవడం వల్ల ఉపశమనం లభిస్తుంది.
- సమస్య ఎక్కువ రోజులు కొనసాగితే స్వీయ వైద్యం చేయకుండా కంటి వైద్యుడిని సంప్రదించాలి.

# మోకాలి నొప్పితో బాధపడుతున్నారా? ఈ విషయాలు తెలుసుకోండి

ప్రారంభ దశలో వచ్చే మోకాలి నొప్పిని చాలామంది పట్టించుకోరు. కానీ అదే నొప్పి క్రమంగా పెరిగితే చివరకు మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స అవసరం వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే సకాలంలో జాగ్రత్తలు తీసుకుని, కొన్ని అలవాట్లను మార్చుకుంటే దీనిని నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.



### ఈ తప్పులు చేయకండి..

- మోకాళ్లపై ఎక్కువ ఒత్తిడి పడేలా భారీ బరువులు ఎత్తడం
- ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోవడం
- నొప్పి ఉందని చెప్పి పూర్తిగా వ్యాయామం మానేయడం
- డాక్టర్ సలహా లేకుండా ఒక్కసారిగా కఠినమైన వ్యాయామాలు ప్రారంభించడం
- మోకాలి నొప్పిని చిన్న సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయడం
- హైహీల్స్ లేదా సరికాని బూట్లు ధరించడం
- బరువు పెరిగినా ఆహారంపై నియంత్రణ లేకపోవడం
- ఫిజియోథెరపీ అవసరమైనప్పటికీ దాన్ని పట్టించుకోకపోవడం
- డాక్టర్ సూచన లేకుండా నొప్పి మందులు వాడటం
- ఈ చిన్న తప్పులే తర్వాత పెద్ద సమస్యలకు దారి తీస్తాయి.

### ఈ లక్షణాలు తేలికగా తీసుకోకండి..

- పదే పదే మోకాలి నొప్పి రావడం
- నడవడానికి ఇబ్బంది
- మెట్లు ఎక్కేటప్పుడు లేదా దిగేటప్పుడు నొప్పి పెరగడం
- మోకాళ్లలో వాపు లేదా గట్టిదనం
- ఉదయం లేవగానే మోకాళ్లు బిగుసుకుపోవడం
- కొంత దూరం నడిచిన తర్వాత నొప్పి ఎక్కువవడం
- విశ్రాంతి తీసుకున్నా నొప్పి తగ్గకపోతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

### ఇవి తప్పకుండా గుర్తుంచుకోండి..

- మీ బరువును నియంత్రణలో ఉంచుకోండి
- రోజూ తేలికపాటి వ్యాయామం, స్ట్రెచింగ్ చేయండి
- సరైన మద్దతు ఉన్న బూట్లు ధరించండి
- నొప్పి అనిపిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించండి
- మోకాళ్లపై అవసరానికి మించి ఒత్తిడి పెట్టవద్దు
- డాక్టర్ సూచన మేరకు ఫిజియోథెరపీ చేయించుకోండి
- ప్రారంభ దశలో జాగ్రత్తలు తీసుకుంటే మోకాలి మార్పిడి అవసరం లేకుండా చాలా వరకు సమస్యను నియంత్రించవచ్చు.

# కాళ్ల వాపు వస్తే తగ్గడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలి..

సాధారణంగా కాళ్ల వాపు (జునవమ్రు) అనేది శరీరంలోని అదనపు ద్రవాలు పేరుకుపోవడం వల్ల వస్తుంది. దీనిని తగ్గించుకోవడానికి ఆహారంలో కొన్ని మార్పులు చేయడం చాలా అవసరం. ముఖ్యంగా శరీరంలోని సోడియం(ఉప్పు) శాతాన్ని తగ్గించి, పొటాషియం శాతాన్ని పెంచే ఆహారం తీసుకోవడం మంచిది. కాళ్ల వాపు తగ్గడానికి మనం తినాల్సిన ఆహారం ఏంటో చూద్దాం.



### 1. పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారం:

శరీరంలో సోడియం బ్యాలెన్స్ చేయడానికి పొటాషియం ఎంతో అవసరం. ఇది ఎలాంటి వాపులనైనా తగ్గిస్తుంది. అరటి పండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. చిలకడదుంప (్రాషవవ్ ్రాశ్ఫ్ శీ) శరీరంలోని అదనపు నీటిని బయటకు పంపడానికి సహాయపడుతుంది. బచ్చలికూరలో ఉండే పోషకాలు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి.

### 2. మెగ్నీషియం అధికంగా ఉండే పదార్థాలు:

మెగ్నీషియం లోపం వల్ల కూడా నీరు పేరుకుపోయి కాళ్ల వాపులు వస్తాయి. బాదం, వాల్‌నట్స్ రోజుకు 4-5 తీసుకుంటే ఎంతో మంచిది. ఓట్స్, జొన్నలు వంటివి తినడం వల్ల కాళ్ల వాపులు తగ్గే అవకాశం ఉంటుంది.

### 3.సహజమై డయూరిటిక్స్:

దోసకాయలో నీటి శాతం ఎక్కువ. ఇది కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది. పుచ్చకాయ కూడా వాపును తగ్గిస్తుంది. మూత్ర విసర్జను పెంచి.. శరీరంలో పేరుకుపోయిన అదనపు నీటిని, ఉప్పును బయటకు పంపిస్తాయి. గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగడం వల్ల విషతుల్యాలు బయటకుపోతాయి.

### 4: స్ట్రీట్ ఫుడ్‌కి దూరంగా ఉండాలి:

ఉదయం లేచిన మొదలు.. రాత్రి పడుకునే వరకు ఏదో ఒక రకంగా స్ట్రీట్ ఫుడ్ తినే అలవాటు ఉన్నవాళ్లకు రకరకాల రోగాలు వస్తున్నాయి. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్, చిప్స్, ప్యాక్ చేసిన స్నాక్స్ వంటివి తినడం వల్ల కాళ్ల వాపులు వచ్చే ఛాన్స్ ఉంది. వీటికి దూరంగా ఉంటే మంచిదని నిపుణులు అంటున్నారు.

### 5. కాళ్లను ఎత్తులో ఉంచండి:

పడుకునే ముందు లేదా కూర్చునప్పుడు మీ కాళ్ల కింద 2-3 దిండ్లు పెట్టుకుని, కాళ్లు మీ గుండె మట్టం కంటే కొంచెం ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.



# పిల్లల చెవిలో నూనె వేయడం మంచిదేనా?

చాలా మంది తల్లిదండ్రులు పిల్లలకు చెవి నొప్పి వచ్చినప్పుడు చెవిలో నూనె వేస్తుంటారు. ఇది పాతకాలం నుంచి వస్తున్న అలవాటు. కానీ ఇది నిజంగా మంచిదేనా? లేక పిల్లల ఆరోగ్యానికి హానికరమా? అనే విషయం చాలా మందికి తెలీదు. పిల్లలకు చెవి నొప్పి వచ్చినప్పుడు ఆవాల నూనె లేదా ఇతర నూనెలను చెవిలో వేయడం చాలా సాధారణం. కొందరు చెవిలో మైనం (వాక్స్) పేరుకుపోయినప్పుడు కూడా నూనె వేస్తారు. కానీ వైద్య నిపుణుల ప్రకారం.. ఈ అలవాటు సమస్యను తగ్గించడం కంటే మరింత పెంచే అవకాశం ఉంది.

### చెవిలో నూనె వేయడం ఎందుకు ప్రమాదకరం?

ఆరోగ్య నిపుణుల ప్రకారం, పిల్లలకు చెవి నొప్పి రావడానికి ప్రధాన కారణం ఇన్ఫెక్షన్ లేదా ఇతర సమస్యలు. అలాంటి సమయంలో చెవిలో నూనె వేస్తే ఇన్ఫెక్షన్ తగ్గదు. పైగా బ్యాక్టీరియా, ఫంగస్ పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో నొప్పి, వాపు, మంట వంటి సమస్యలు పెరుగుతాయి. చెవి నుంచి చీము లేదా నీరు వస్తుంటే.. చెవిలో నూనె వేయడం మరింత ప్రమాదకరం. జలుబు లేదా జ్వరం సమయంలో కూడా చెవి నొప్పి రావచ్చు. అప్పుడు ఇంటి చిట్కాలు ప్రయత్నించకుండా ముందుగా వైద్యుడిని సంప్రదించాలి.

### చెవి నొప్పి వచ్చినప్పుడు ఏం చేయాలి?

పిల్లలకు చెవి నొప్పి ఉంటే తప్పనిసరిగా జుచీ వైద్యుడిని సంప్రదించాలి. స్వయంగా మందులు లేదా ఇంటి నివారణలు చేయడం వల్ల సమస్య మరింత ఎక్కువ కావొచ్చు.

- చెవిని శుభ్రం చేసే క్రమంలో ఇయర్‌బడ్‌ను జాగ్రత్తగా ఉపయోగించాలి.
- ఇయర్‌బడ్‌ను చెవిలో చాలా లోతుగా పెట్టకూడదు.
- వైద్యుడి సూచన లేకుండా చెవిలో డ్రాప్స్ వేయకూడదు.
- పిల్లలు తరచూ చెవిని పట్టుకోవడం, ఏడవడం చేస్తే వెంటనే గమనించాలి.
- స్నానం చేయించేటప్పుడు చెవిలోకి నీరు లేదా సబ్బు వెళ్లకుండా చూసుకోవాలి.
- చల్లని వాతావరణంలో చెవులను వెచ్చగా ఉంచాలి.




# 30 నుంచి 35 ఏళ్ల మధ్య.. బీపీ రాకుండా ఉండాలంటే ఇలా చేయండి.!

బీపీ ఇప్పుడు చాలా మందిలో కనిపిస్తున్న సాధారణ ఆరోగ్య సమస్య. దీన్ని నియంత్రించకపోతే గుండెపోటు, స్ట్రోక్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో యువతలో.. ముఖ్యంగా 30 నుంచి 35 ఏళ్ల వయస్సు గల వారిలో బీపీ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది.

జీవనశైలి, ఆహార అలవాట్లు, మానసిక ఒత్తిడి వంటి కారణాల వల్ల చిన్న వయసులోనే ఈ సమస్య పెరుగుతోంది. అధిక రక్తపోటు సమస్య చాలాసార్లు ఎలాంటి లక్షణాలు లేకుండా శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి లక్షణాలను ముందే తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

### అధిక రక్తపోటు లక్షణాలు..

- తలనొప్పి, తల బరువుగా అనిపించడం, తల తిరగడం, ఆందోళన
- కళ్లకు మసకగా కనిపించడం, అలసట

### బీపీని నియంత్రించడానికి చిట్కాలు..

- ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి.
- ఉప్పు తక్కువగా తీసుకోండి (రోజుకు 5 గ్రాముల కంటే ఎక్కువ కాకూడదు).
- జంక్ ఫుడ్, ప్యాక్ చేసిన ఆహారాలను తగ్గించండి.
- మానసిక ఒత్తిడిని తగ్గించుకోండి.
- ఆరోగ్యకరమైన బరువు ఉండేలా చూసుకోండి.
- రోజూ వ్యాయామం చేయండి.

